మగాడంటే
అసహ్యించుకునే
ఆమె ప్రేయసిగా
ఎలా మారింది!

# జీవనరేఖ

సామర్ల
లక్ష్మీరాజ్
కథ

ప్రభూ!

రేయి రాకకోసం పగలంతా వేయి కళ్లతో ఎదురుచూసి...

నువ్వొచ్చే దారిలో వెన్నెల కిరణాల్ని పరచి, తారకలను గుత్తులుగుత్తులుగా అమర్చి...

సింగారించిన మోముతో... మరిన్ని అలంకారాలతో ఈ మేనిని సంసిద్ధపరచి...

నీ స్పర్శకై తపనపడి, అంతలోనే ఉలిక్కిపడే మనసుని మెల్లిగా జోకొడుతూ...

ప్రణయమంటే ఎరుగని నాలో శృంగార భావాలను రగిల్చి... పరిణయపు పందిరిలో అర్ధాంగినిగా స్వంతం చేసుకుంటానని బాసలు చేసిన నీకై...

తనువు, మనసు ఏకమై సహస్ర వేణువులు పలికిస్తూ...

నీ అడుగుల సవ్వడికై —
నీ మోహపు నవ్వుకై—
ఆ స్నేహపు చూపుకై —
స్వాంతన పర్చు పలుకుకై —
అహరహం తహతహలాడుతూ తపిస్తూ...

స్వాగత సన్నాహాలతో ఆహ్వానించేందుకై ద్వారంవద్దే వేచివున్నాను!

నీ సారికనై —
అభిసారికనై!

అతనొచ్చే సమయం ఆసన్నమయ్యేకొద్దీ ఆమె హృదయం ఆనందంతో గంతులు వేస్తోంది.

ఎంతగాఎదురుచూస్తోంది అతనిరాకకై!
సడెన్‌గా ఆమె తనలోతనే నవ్వుకుంది.

'నిజమే! తనెంత మారిపోయింది! అసలీ జన్మలోనే మగాడు అనే జీవినే నమ్మకూడ



దు అవి శపధం చేసుకున్న తననే మార్చివేసి
వ అతను —
అసలు స్త్రీ ఎప్పుడూ స్త్రీయే —
మగాడి తోడునీడకై తపించిపోయే వేళ...

పూజకు సిద్ధపడిపోయే పూబాల...
కఠిన పాషాణ మనస్కురాలినైన తను
అతనిచే ఆకర్షింపబడడం విజంగాచిత్రమే...
ప్రేమంటే ఇదేనా...?

ఇదేనేమో...

అసలు ప్రేమకు నిర్వచనమేమిటో...? ఈసారి అతనొచ్చినప్పుడు అడగాలి! అతనేం జవాబుచెబుతాడో తెలుసుకోవాలి! ఆమె తన ఊహల్లో విహరిస్తోంటే... టక్కున వాస్తవంలోకి లాక్కొస్తూ —

"ఏంది? గింకా నీ లవర్ రాలే! టయిమయితాంది! పెయ్యిగిట్ల బాలేదా? ఏంది కత? రోజు ఏడు గంట కొట్టేతలికి హాజరైతడు. ఏమాయే? ఇంక రాయపోయె మనసులో మాట — ఏమయినా కిరికిరి పెట్టుకున్నవా? గుస్పమీదుండి రాలేదేమో.. గయినా నిన్ను ఇడిపి ఎప్పుడుండాలె? వస్తనె వుంటడు! దార్లో వుండుంటడు జూస్తుంందు. నామాట సచ్ అయితది!" తు పుక్కున నోట్లో పాన్ కచరాను ఉమ్మేస్తూ అంటోన్న రజియావంక బేలగా చూసింది. ఆ కళ్లలో ఉబుకుతోన్న నీళ్లు...

"అదిగో! గట్ల ఊకే ఏడ్వకు! నే చూడలేను పోరీ! జర సంజాయించుకోవాలె! అసలు గసుమంటి పోరగాడు దొరుకుట నీ అదృష్టమే! ఊకో! ఊకో మల్లా!" ప్రేమగా ఆమె తల నిమురుతూ, జారిపోతున్న నైలాను పైటను పైకి లాక్కుంటూ వెళ్లిపోయిందామె.

చీప్ రకం చెమ్కీ జాకెట్టు...

లంగా రంగు కన్పించే నైలాను చీర...

తమలపాకులతో ఎర్రబర్చే పెదవులు...

నుదుటిపైకి దువ్వేసిన జుట్టు...

కొంచెం చిన్నదానిలా కన్పించాలని రజియా పడే పాట్లకు జాలికలిగింది.

జాలి!

తనమీద తనకే జాలి!

చుట్టూ వున్న సహచరులపై జాలి!

ఇదో విషవలయం.

రాత్రి అయితే పూలు ముదుచుకుని విటుల రాకకై ఎదురుచూసే హాలాహలపు నిలయం —

వేశ్యావాటిక!

తనో వేశ్య!

అవును! తనూ ఒక వేశ్యేగా!

ఆ ఊహ రాగానే చిగురుటాకులా వణికిపోయింది.

ఆమె దేహం!

ఈ దేహం ఎందర్ని అలరిస్తోందో...

మరెందర్ని తృప్తి పరుస్తోందో...

ప్రతిరేయి మలినపడుతోన్న ఈమెని...

అనుదినం శరీరంతో వ్యాపారం చేస్తూ...

బజార్లో అంగడిబొమ్మలా మారిన తన బతుకుకు కారణం ఎవరు? ఎవరు?...

అదీ ఓ మగాడే!

అనాదిగా వస్తోన్న కథే! పాతకథే!

చర్విత చరణంలా —

అమాయకంగా మోసపోతోన్న ఆడది...

ప్రేమపంజరంలో చిక్కుకుని, అన్నివైపులా బంధింపబడి, బయట వెళ్లేదారిలేక —

అదే ప్రపంచమనుకుని... ఆ భ్రమలోనే తేలిపోతోన్న తనని ఈ ప్రపంచంలోకి పడేసి వెళ్లిపోయాడు.

తన మొగుడు!

అగ్నిసాక్షిగా వివాహమాడిన వాడు!

ప్చ్! అసలది పెళ్లా? తన పిచ్చికానీ...

అతనాడిన నాటకంలోని ఓ అంకం మాత్రమే...

ఎంత హాయిగా ఆనందంగా వుండేది తను. పదహారేళ్ల ప్రాయంలో అమ్మా,

నాన్న, చెల్లెళ్ల మధ్య ఎంత నిశ్చింతగా జీవించేది. ఏపుగా ఎదిగిపోతున్న అందాల్ని రెప్పవాల్చకచూసేవాడు కామందు కొడుకు. నీట్‌గా టక్‌చేసిన బట్టలతో సిన్మా హీరోలా కన్పించేవాడు. అదో రకమైన స్టయిల్‌తో మెల్లిగా మాటలు కలిపి స్నేహం చేస్తూ ప్రేమ మైకంలో పడేశాడు.

అతన్ని నమ్మి, సర్వస్వం అతనే అనుకుని జన్మనిచ్చిన తల్లిదండ్రుల్ని వదిలేసి లేచిపోయింది.

పట్నంలో ఓ గది తీసుకుని —

పసుపుతాడు కట్టి —

పగలు రేయి తేడాలేక ఒంటినివాడుకుని —

వదిలేసి వెళ్లిపోయాడు!

తను ఒక్కతే! నిస్సహాయంగా రోదిస్తూ "ప్రేమా! ప్రేమా! ఎందుకిలా చేశావ్? నువ్వేదైవమనినమ్మినందుకు ముంచేసావ్!"

అంతులేని దుఃఖసంద్రం ఉప్పొంగుతూ ...

ఏవుంది? ప్రతి ప్రేమ కథకు తుది మజిలీ పాడే —

వల్లకాడేగా...

కానీ తను చావలేక —

ఈ రొంపిలోకి దిగిపోతూ...

ఎన్ని రాత్రులు, ఎన్నెన్ని గంటలు ఏడ్చింది. వెక్కి వెక్కి పడుతూ తన రోదన — అరణ్యరోదనే అయింది.

కానీ —

చివరకు అతను—

పిల్లగాలిలా తనను పలకరిస్తూ...

సుడిగాలిలా చుట్టేసరికి విస్తుపోయింది.

ఓ రాత్రి —

"నువ్వు నాకు నచ్చావు! నీ స్వభావం, అందం, గుణం అన్నీ నచ్చాయి. ముందు ఆనందంకోసం నిన్ను పొందినా ఇప్పుడు నేను ప్రేమిస్తున్నాను. ఈ చీకటి బతుకు నుండి వచ్చేయ్! వెళ్లిపోదాం! పెళ్లిచేసుకుందాం! ఎక్కడైనా దూరంగా వెళ్లి హాయిగా జీవిద్దాం" అంటోన్న అతన్ని సూటిగా చూస్తూ —

## సిగ్గు



"ఏమయ్యా! సిగ్గులేదు అడుక్కోటానికి!" అన్నాడో పెద్దమనిషి.

"అది వుంటే మీలా నీతులు చెప్పేవాళ్లే సార్!" అన్నాడు ధీమాగా బిచ్చగాడు.

— కె.శ్రీనివాసులు (యమ్మిగనూరు)

''ఏం? ఇక్కడనుండి నన్ను బొంబాయి కామాటిపురాకు పంపించేద్దామనా మీ ప్రయత్నం'' కసిగా అంది ఆమె.

దెబ్బతిన్నట్టుగా విలవిల్లాడిపోతూ చూశాడు. అంతలోనే సర్దుకుంటూ —

''మనుషుల్ని నమ్మకూడదని నీ అనుభవం నీకు నేర్పించి వుండొచ్చు! కానీ నాకు నువ్వు కావాలి. నువ్వు ఇష్టపడి నాతో కలిసి జీవించేందుకు ఒప్పుకునే వరకూ నేను వస్తాను. ప్రతి రాత్రి నీ అంగీకారంకై ఎదురుచూస్తాను!'' కృతనిశ్చయంతో అన్న ఆ మాటలు ఆమెను విస్మయపరచాయి.

''మరో గొప్ప సంఘ సంస్కర్త కాబోలు'' వెటకారంగా అంది.

''నువ్వేమనుకున్నా సరే! నాకు నువ్వు కావాలి. నీ 'అవును' అనే జవాబుకోసం ఎంతకాలమైనా వెయిట్ చేస్తాను'' దృఢంగా అనేసి వెళ్లిపోయాడు.

కానీ —

ఆశ్చర్యపరుస్తూ...

అతను రోజూ వస్తోన్నాడు. అదే ఆశతో ఆమెకోసం...

మొదట్లో ఆశ్చర్యపోయింది.

తరువాతతరువాత మోజేమో అనుకుంది.

రెండేళ్ల సుదీర్ఘకాలంతోపాటు అతన్ని నమ్మింది.

ఈ రాత్రి అతనొస్తే — సంతోషపడే సమాధానం సిద్ధపరచుకుంది.

కానీ — ఆమె ఆశ నిరాశే అయింది.

అతను రాలేదు!

అదేరాత్రి ఆమె జీవితాన్నే బలితీసుకునే మరో సంఘటన చాలా మామూలుగా జరిగిపోయింది. అనుకోని ఆ దుర్ఘటనకు ఆమె మనసు ముక్కలు ముక్కలుగా చితికిపోయింది.

○ ● ○

మర్నాడు —

అతనొచ్చేసరికి ఆమె ధురురాలేదు. ఆమెకోసం ఆశగా ఆర్తిగా చూసే అతనితో ''సారిక గిక్కడ లేదుసాబ్! బొంబాయినుండి ఓ పైసలున్న సేఠ్ ఎప్పటికీ వుంచుకుంటానంటే గా బడాసాబ్‌తో వెళ్లిపోయింది''

రజియా అన్న మాటలకు —

అతను విస్తుపోయాడు ముందు. అయినా —

ఇంకా నమ్మకం కుదరగా వించోన్న అతనితో ''గా పోరిలేదు. ఇంకో పిల్ల గావాలంటే వుంది. గావాల్నా'' రజియా పలుకులకు విషణ్ణ వదనంతో, వివర్ణమైన మొహంతో నిరాశగా నిస్సహాయుడిగా భారంగా అడుగులు వేసుకుంటూ వెళ్లిపోయాడు. పక్కనుండి అతను వెళుతోన్నవైపే చూస్తూ వెక్కి వెక్కి ఏడుస్తూ ''హే భగవాన్! ఎందుకిలా చేశావ్! ఓ మగాడు బతుకుని ముళ్లబాట చేస్తే — మరో పురుషుడు జీవితాన్నే ప్రసాదిస్తానన్నాడు. కానీ ఓర్వలేని నువ్వు ఎయిడ్స్ రూపంలో నన్ను కబళించబోతున్నావు. ఈ రాక్షసరోగంతో అతని జీవితాన్ని చీకటిమయం చేయలేక — అతన్లేక నేను బతకలేక ఎలా? ఎలా జీవించాలి? కొందరి రాతల్ని ఇలా మార్చి ఆనందిస్తావెందుకు తండ్రీ!'' దయనీయంగా, దీనంగా గుండెలవిసేలా రోదిస్తోంది ఆమె.

''ఏందో! గా దేవునికి గూడా జర్రంత జాలి లేకపాయెగదా!'' నిట్టూర్చింది సాను భూతిగా రజియా.

○ ● ○